# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-44 సంచిక - 6 హైదరాబాదు జూన్, 2024 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 44 Issue - 6 Hyderabad June, 2024 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



***BHAGAVAN SRI RAMANA MAHARSHI***



***ARUNACHALA HILL*** (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి
జూన్ 2024

Sri Ramana Jyothi
June 2024

ఈ సంచికలో ...

IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 119వ ప్రవచనం | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | స్వామి రాజేశ్వరానంద | శ్రీ ఎమ్.వి.ఎస్. ప్రసాద్ | 14 |
| 3. | శ్రీ రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు | శ్రీమతి మల్లాది ఫణిమాల | 17 |
| 4. | శ్రీ విశ్వనాథస్వామి స్మృతులు | శ్రీ బి. రవికృష్ణ శర్మ | 21 |
| 5. | Knowledge and Wisdom | Dr K Subrahmanian | 30 |
| 6. | Ashtavakra Gita 25 | V Krithivasan | 37 |
| 7. | Mother Azhagammal | Sneha Choudhury | 41 |
| 8. | The Journal | SS Cohen | 45 |
| 9. | Cow Lakshmi comes to ashram | Shanthamma | 47 |
| 10. | In the Hall of Bhagavan | | 48 |

**Events in Sri Ramana Kendram in June 2024**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 9th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
4. Cow Lakshmi day - 18th June

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# భావన అన్నిటికీ మూలం

డా॥ కే.యస్. గారి 119వ ప్రవచనం

అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

**మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః**

'బంధ' అంటే బంధింపబడడం, 'మోక్ష' అంటే స్వేచ్ఛగా వుండడం. మన మనస్సు ఎలా వున్నది అన్న దానిని బట్టి, మనము బంధములో వున్నామా లేక స్వేచ్ఛగా వున్నామా అన్నది తెలుస్తుంది. మీరు స్వేచ్ఛగా వున్నారని భావిస్తే స్వేచ్ఛగా వున్నట్లు, మరియు బంధంలో వున్నారని భావిస్తే బంధింప బడినవారు అవుతారు.

మనమందరము మనస్సు వేరు, శరీరం వేరు అని అను కొంటాం. కాని, ఉదాహరణకు, మీరు కోపంగా వుంటే, కోపంగా వున్నారని ఎదుటి వారికి మీ ముఖం చూస్తే తెలుస్తుంది. మీ కోపం, మీ శరీరంలోను, మీ ముఖంలోను ప్రతిఫలిస్తుంది. మీ ముఖం ఎఱ్ఱబారుతుంది. శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. అలానే, మితిమీరిన కోపం వున్నప్పుడు, మనిషి సరిగా మాట్లాడలేక పోవచ్చు కూడా. కోపంగా వున్నారని ప్రత్యేకించి ఎవరికీ చెప్పనవసరం లేదు. అలానే, మీరు సంతోషంగా వున్నప్పుడూ ఎవరికీ చెప్పనవసరం లేదు.  వాళ్ళే తెలుసుకుంటారు. ఒత్తిడిలో వున్న వ్యక్తి ముఖంలో, ఆ ఒత్తిడి ప్రతిఫలిస్తుంది. అలానే, ఒక వ్యక్తి ప్రశాంతంగా వున్నాడు అనేది, అతని ముఖం తెలియజేస్తుంది. వేరొక విధంగా చెప్పాలంటే, ఇదంతా కూడా మనస్సు యొక్క ప్రతిబింబమే. మనస్సు ఎప్పుడైతే

సంపూర్ణంగా మన అధీనంలో వుంటుందో, అప్పుడు శరీరం కూడా మన అధీనంలో వుంటుంది.

## స్పందనలో తేడాలు

నడుస్తున్నప్పుడు, కాలు ఒక బండరాయికి కొట్టుకుంటే, గాయమై, కాలి బొటన వేలుకు లేదా శరీరానికి రాయి తగిలిన భాగం నుండి రక్తం కారుతుంది. చిన్న పిల్లలకు గాయమై ఏడ్చినప్పుడు, అక్కడ మనం ఏదో మందు రాస్తాము. మన అనుభవాన్ని బట్టి, బిడ్డ తన గాయాన్ని గురించి పెద్దగా పట్టించుకోదు అని మనకు తెలుసు. ఇంకా చెప్పాలంటే, పిల్లలు దెబ్బ తగిలిన అరగంటకే ఆడుకోవడానికి పోవాలని సిద్ధపడుతూ వుండడం, మనం తరచూ చూస్తూ వుంటాం. దెబ్బ తగలడం వలన కలిగే నొప్పి అనేది, పెద్దవాళ్ళకైనా, చిన్న వాళ్ళకైనా ఒకే విధంగా వుంటుంది. కాని, పిల్లలు స్పందించే తీరు, పెద్దవాళ్ళ తీరు వలె వుండదు. పెద్దలమైన మనం, గాయానికి మందు రాసుకుంటాం కాని, మనసులో ఎన్నో ఆలోచనలు మెదులుతూ వుంటాయి. గాయం తొందరగా మానుతుందా? మానకపోతే ఏమి చేయాలి? ఇలాంటి ఆలోచనలు వస్తూ వుంటాయి. ఎంతో చింతిస్తాం, వ్యథ చెందుతాం. అరవై, డెబ్భై ఏళ్ళ వయస్సు తరువాతనైతే, విపరీతంగా బాధపడి, యిది మరణానికి దారితీస్తుందా? అంటూ కూడా ఆలోచనలు ఒకదాని తరువాత ఒకటి మనసులో వస్తూ వుంటాయి. ఆ గాయము, నొప్పి తప్ప మరే యితరమైన దాని మీదకీ ధ్యాస పోదు. దాని ఫలితంగా ఏమేమి జరుగుతాయో అన్న ఆలోచనలు

ప్రశాంతముగా వుండనీయవు. ఇది చేయాలా, అది చేయాలా అని అనుకుంటూ, ఎందరో డాక్టర్ల వద్దకు వెళతాం. అదే సమయంలో, జాగ్రత్తగా వుండాలని ఎవరైనా ఉచిత సలహాలు యిస్తే, ఒత్తిడి మరింత పెరుగుతుంది. వాళ్ళు అలాగ అనడంతో, మన నుండి ఏదైనా భయంకరమైన విషయాన్ని దాస్తున్నారా? అని మరొక అనుమానం కలుగుతుంది. వీటన్నింటినీ గమనించినప్పుడు, మనం గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే, దెబ్బ తగలడము, నొప్పి కలగడము అనేది అందరి విషయంలో సమానంగానే వున్నా, స్పందించే తీరు వేరుగా వుంటుంది.

మరొక విషయం ఏమిటంటే, మనకు తలనొప్పి వున్నప్పుడు, మనకు నచ్చిన వ్యక్తి ఎవరో దగ్గరికి వస్తే, ఒంటరిగా వున్నప్పటికంటే నొప్పి తక్కువైనట్లు అనిపిస్తుంది. అదే మనకు నచ్చని వ్యక్తి వస్తే, తలనొప్పి మరింత ఎక్కువైనట్లు భావిస్తాం. అంటే, తలనొప్పి అదే స్థాయిలో వున్నప్పటికీ, అది ఎక్కువో, తక్కువో అయినట్లు అనిపిస్తుంది.

మనము శరీరము, మనస్సుల గురించి మాట్లాడుకుంటే, మనస్సు వున్నప్పుడే, శరీరం వున్నది అనేది మనకు తెలియవస్తుంది. అంటే, మొట్టమొదట అంతా మొదలుపెట్టేది మనస్సే. ప్రొద్దున నిద్ర లేచినప్పటి నుండి, మళ్ళీ పడుకునేదాక, ఆ రోజంతా మనము కలిసిన వ్యక్తులను గురించి, అవతల వ్యక్తి మంచివాడేనా? కాదా? అని అతని ముఖం యొక్క తీరును బట్టి మానసికంగా నిర్ణయించు కుంటాం. అప్పటినుండి ఒక అభిప్రాయం ఏర్పడుతుంది. అలాగని,

ఆ మనిషి అందంగా, సుందరంగా వున్నదానిని బట్టి ఆ అంచనా వేస్తారా? అంటే, కాదు. అప్పుడప్పుడు, మనం అనుకుంటున్నది యథార్థమేనా అనే సందేహం కూడా మనకు రావచ్చు.

జన్మతః మనలో ఏర్పడిన వాసనలను బట్టి, మన మనస్సు యితరుల గుణగణాలపై నిర్ణయాలను తీసుకుంటుంది. దుర్యోధనుడు ప్రతి విషయాన్నీ చెడుగానే తీసుకునేవాడు. ధర్మరాజు, అన్నింటినీ మంచివిగానే భావించేవాడు. దానికి కారణం ఏమిటి? అన్నింటికీ మూలము 'మన ఆలోచనా విధానమే'. ప్రతి రోజూ మనకు ఏదో ఒక విషయంలో ఆందోళన కలగవచ్చు, కోపం రావచ్చు, కలవరం కలగవచ్చు. అలా కలగటానికి కారణం, మనము కోరుకున్న విధంగా జరగవలసినది జరగక పోవటం వల్ల. అంటే, క్రోధానికి కారణం కోరిక. కోరిక లేకపోతే కోపం వుండదు.

శరీరం యిబ్బందికర పరిస్థితిలో వున్నప్పటికీ, మనస్సు బాహ్య విషయాలను పట్టించుకొనక పోతే, శరీరానికి గాయమైనా లేదా జబ్బు చేసినా, వ్యక్తిని అవి బాధ పెట్టలేవు. అందుకే, ఈ రోజుల్లో, డాక్టర్లు కూడా మానసిక ప్రవృత్తికి ప్రాధాన్యతను యిస్తున్నారు. ఇది జనులకు అంతగా నచ్చని విషయం అయినప్పటికీ, ఒక వ్యక్తి, శరీరానికి ప్రాధాన్యతను యిస్తే, యివ్వబడిన ఎంత మంచి మందైనా సరే, దెబ్బ లేదా గాయం మానడానికి, ఎక్కువ సమయం తీసుకుంటుంది. అంటే, శరీరం పట్ల విముఖంగా వుంటే లేదా పట్టించుకొనకపోతే, శరీరానికి రుగ్మత వున్నప్పటికీ, దాని వల్ల

భయపడరు. ఆఖరుకు, జబ్బు వున్న మనిషికి ఏమవుతుంది? చనిపోవచ్చు. మరణం రాకుండా ఏ విధంగానూ ఆపలేము. నేను మరణించవలసి వచ్చినప్పుడు, నాతో సహా, ఈ ప్రపంచంలోని ఏ రక్షణ శక్తీ, అతి నిపుణులైన డాక్టర్లు ఎవరూ, ఆ రోజు, ఆ క్షణంలో, మరణాన్ని ఆపలేరు.

**యమాయ ధర్మరాజాయ మృత్యవేచ అంతకాయచ**

**వైవస్వతాయ కాలాయ సర్వభూత క్షయాయచ.**

ఈ నామాలు చాలా అద్భుతమైనవి. మరి ఏ యితర సంస్కృతి లోనూ, యమునికి యిలాంటి పేర్లు లేవు. భయం పుట్టించేటటు వంటి పేర్లు యమునికి లేవు. యముడే ధర్మరాజు అనడంలోని అర్థం, మనము మృత్యువును గురించి ఎంత గొప్ప దృక్పథం కలిగి వుండాలో, ఆ నామాలలో తెలియజేస్తున్నారు. ఆయన మన శరీరాన్ని అంతం చేసేవాడు. వ్యక్తి మరణించాల్సిన ఆ రోజు, ఆ క్షణంలో, ఖచ్చితంగా, యిష్టాయిష్టాలతో సంబంధం లేకుండా, చిన్న పిల్లలు - పెద్దవాళ్ళు, ధనవంతుడు - పేదవాడు అన్న తేడాలు చూడకుండా, తన ధర్మాన్ని తాను నిర్వర్తిస్తాడు.

## శరీరం రాలిపోయేదే

భగవంతుని కృపతో, మనం ప్రయత్నం చేసినప్పటికీ ఏదో ఒక రోజు శరీరం రాలిపోతుందని గ్రహిస్తే, మన ప్రవర్తనా తీరు మారుతుంది. జబ్బులు చేస్తాయి, సమస్యలూ వస్తాయి. మన ఆరోగ్యం విషమిస్తే, యితరులను యిబ్బంది పెడతామేమో అన్న

ఆలోచన రావడం ఒక రకంగా మంచిదే. దానిని గుర్తించినప్పుడు, యితరులకు యిబ్బందిని కలిగించడం వీలైనంతగా తగ్గిస్తాము. మనం స్వతంత్రంగా వుండాలనే అనుకుంటాము. కాని, వయసు మీద పడే కొద్దీ, ప్రతి ఒక్కరూ యితరుల మీద ఆధారపడవలసి నదే. ప్రతి విషయానికీ యితరుల సహాయం కావాలి. ఇది గుర్తించిన కొద్దీ, మనకు సహాయం చేస్తున్న వారి పట్ల మరింత కృతజ్ఞతతో వుంటాం.

మనము అనుకునే స్వాతంత్ర్యం ఏమిటి? మన దగ్గర ధనం వుండవచ్చు. కాని, ఏదైనా కొనుక్కోవాలనుకున్నా లేదా బ్యాంక్‌కు పోవాలనుకున్నా, మనకుగా మనము పోలేము. ఒకరి మీద ఆధార పడవలసినదే. ఎప్పుడైతే యితరులు మన కోసం అన్నీ చేస్తున్నారో, అప్పుడు మనం స్వతంత్రంగా వున్నామని చెప్పగలమా? అంటే దానర్థం, ప్రతీదీ కూడా ఒక దానిమీద ఒకటి ఆధారపడినదే అని తెలుస్తున్నది. ఎప్పుడైతే మనం దీనిని అర్థం చేసుకుంటామో, యితరుల యందు మన దృక్పథం మారుతుంది. అప్పుడు మనకు సహాయం చేసే ప్రతి ఒక్కరి యందు మనకు కృతజ్ఞతాభావం ఏర్పడుతుంది. ఎప్పుడైతే యిటువంటి భావన మనకు కలుగుతుందో, అప్పుడు మనం యితరుల మీద ఆధారపడవలసి వచ్చిందే అనే అసంతృప్తి పోతుంది. అప్పుడు యిక మనలో దేనినీ వ్యతిరేకించే స్వభావం కానీ, యిది నాకొద్దు అనుకునే భావన కానీ వుండదు. ఎప్పుడైతే మనకు ఈ విధంగా జీవించాలి అని అర్థమవు

తుందో, అప్పుడు అది మనకు ఒక పాఠం నేర్పుతోందని తెలుసుకుంటాము.

భగవాన్‌కు క్యాన్సరు వ్యాధి వచ్చింది. కాని, వారు తమ స్థితి పట్ల పూర్తిగా తటస్థంగా వుండేవారు. మనసు యొక్క ప్రమేయం లేని ఆ స్థితికి చేరినప్పుడు, అలాగ వుండడానికి సాధ్యమవుతుంది. ఇవి ఏవో అర్థంలేని మాటలు కావు. ఎంతో బాధ కలిగించే వ్యాధితో వున్నప్పటికీ, నిద్రించిన వెంటనే, మనకు తిరిగి మెలకువ వచ్చేదాకా నొప్పి తెలియదు. ఇంకొక మాటలో చెప్పాలంటే, నొప్పి అనేది శరీరానికి  కాని మనకు కాదు. ఎందుకంటే మనస్సక్కడ లేదు కనుక.

నిద్రపోతున్నంత సేపు మనస్సు లేదా నొప్పి అనేది, హృదయంలో లేదా ఆత్మలో లీనమై వుంటుంది. ఉదయం పూట మనమెప్పుడైతే మేలుకొంటామో, అంటే మనస్సనేది బయటికి వస్తుందో, మనకు నొప్పి తెలుస్తుంది. ఎందుకంటే, మనం శరీరాన్ని చూస్తాము కనుక మరియు దేహమే నేను అనే అనుభవం కలుగుతుంది కనుక. కాని ఋషులు మరియు మునుల విషయంలో అలా జరగదు. వాళ్లకు మనస్సనేదే వుండదు. వాళ్ళు ఎల్లప్పుడూ శరీర భావన నుండి సంపూర్ణంగా విడివడి ఉంటారు. అందువల్ల, మనం ఎంతగా శరీరం కాదు అని సాధన చేస్తామో, అంతగా శరీరం నుండి విడివడి వుంటాము.

మనం సమస్యలతో మమేకమయ్యే కొద్దీ, అవి యింకా పెరిగి పోతూ వుంటాయి. మనకు ఏదో జరిగింది అని, అలా జరిగి వుండక

పోతే బాగుండేది అని, మొత్తం మనస్సును మనం అదే ధ్యాసలో వుంచితే, బాధ మరింత ఎక్కువై అధ్వాన్న స్థితికి చేరుతుంది. ఈ విషయంలో మనం చిన్నపిల్లల వలె ప్రవర్తించాలి. బిడ్డను కొడితే, ఆ బిడ్డ ఏడిచి కోపం తెచ్చుకుంటుంది. ఒక ఐదు నిమిషాలు గడిచిన తరువాత చాక్లెట్ యిస్తే, మీరు కొట్టిన విషయం మరచి పోతుంది. మీ పట్ల విరోధ భావన పెంచుకోదు. అదే, పెద్దవాళ్లను మనం గాయపరచి, ఆ తరువాత చాక్లెట్ యిస్తే, వాళ్ళు, "నన్ను ఒక చాక్లెట్‌తో కొనాలని చూస్తున్నారా?" అని కోపంతో ఊగిపోతారు. పిల్లలు మాత్రం అలాగ ఎందుకు చేశారని ప్రశ్నించరు.

మనం, కొట్టి బాధ కలిగించామని అనుకుంటాం. కాని మన లాగ వాళ్లకు వ్యక్తిత్వ భావన వుండదు. కాని, పెద్దవాళ్ళం అనుకునే మనం, ఎవరైనా మనల్ని మాటలతోనో, చేష్టలతోనో గాయపరిస్తే బాధపడతాం. ఎందుకంటే, నేనొక ముఖ్యమైన వ్యక్తినని, యితరులు నన్ను బాధ పెట్టారని అనుకుంటాం. భగవంతుని కృప వల్ల, ఎప్పుడైతే మనము యితరులు మనల్ని ఏదో అన్నారన్న భావన నుండి విడివడతామో, యిక అప్పుడు మానసికమైన బరువు ఏదీ వుండదు.

**భావన అసలు కారణం**

మన ఒత్తిడికి కారణం భావనయే. ఎప్పుడో పది పదిహేను ఏళ్ళ క్రిందట జరిగిన సంఘటనను కూడా గుర్తుచేసుకోవచ్చు. అలాగ కాకుండా చిన్న పిల్లల మాదిరి ప్రవర్తిస్తే మానసిక బాధ వుండదు. అప్పుడు మన మనస్సు, శరీరం పట్ల మన తీరు పూర్తిగా

మారుతుంది. అంటే, గత సంఘటనలను మనసులో దాచుకోకుండా, ఏ క్షణానికి ఆ క్షణం జీవిస్తూ పోతాం. గాఢనిద్రలో పగలు జరిగినది గుర్తుండదు. అందువల్ల ఉదయం లేచినప్పుడు కొంత శాంతి లభిస్తుంది. మళ్ళీ ఈ ప్రపంచపు గొడవలతో అలజడి మొదలవుతుంది.

అందుకే, ఉదయమే యితర పనుల జోలికి వెళ్లక ధ్యానం, ప్రార్థన లేదా జపం చేసుకోవాలి. దాని వల్ల సమయం వృథా అయిందని అనుకోకూడదు. అది అసాధారణమైన పరిశుద్ధతను, నిర్మలత్వాన్ని కలిగించే ప్రక్రియ. జపం చేస్తున్నవారు పొందే శాంతి కొంతే అయినప్పటికీ, రోజంతా దాని ప్రభావం వుంటుంది. అందుకే, రాత్రి పడుకోబోయే ముందు మరియు ప్రొద్దున లేచిన వెంటనే జపం లేదా ధ్యానం చేసుకోవాలని అంటారు. అలాగ చేయగలగ డానికి కూడా భగవంతుని కృప అవసరము.

మనము శరీరం వేరు, మనసు వేరు అని భావించినప్పటికీ, గొప్ప జ్ఞానుల అనుభవాన్ని బట్టి, మనస్సుపై అదుపు వచ్చినప్పుడు శరీరం కూడా అదుపులోకి వస్తుంది. నేను ప్రయత్నం చేసి నా శరీరాన్ని బలంగా చేసుకోవచ్చు. అంతమాత్రాన మానసిక బలం చేకూరదు. కాని, మనసు మీద అదుపు సాధిస్తే, శరీరం ఎలాగ వున్నప్పటికీ బలంగానే వుంటాము. ఆరోగ్యం బాగున్నా లేకపోయినా మనం చింతించం.

మానసిక బలంతో శరీరాన్ని తగిన విధంగా ఉపయోగించు కోగలం. మనసు పూర్తిగా ఆత్మలో లీనమైనప్పుడు మానసిక బలం,

శారీరక బలం అన్న వాటి ప్రసక్తియే వుండదు. అప్పుడు పనులన్నీ ఏ ప్రయత్నమూ లేకుండా చేసుకోగలుగుతాం. అంటే, సంపూర్ణ స్వేచ్ఛ లభిస్తుందన్నమాట. బంధం అనేది వుండదు. ఏ కోరిక లేని ఆ స్థితిలో, మనం చేసే ప్రతి పనీ యితరుల మంచి కోసమే చేస్తాం. అది మన ప్రయత్నపూర్వకంగా కానప్పటికీ, అప్పటి మన ఆ స్థితి వల్ల యితరులకు కూడా మంచి జరుగుతుంది.

అందుకే రమణ మహర్షుల వంటి మహాత్ములు, మన వలె ప్రత్యేకించి ఏమీ చేయనక్కరలేదని వినోబా భావే అన్నారు. కేవలం వారి సన్నిధి ప్రభావం వల్ల విశ్వానికి మంచి జరుగుతుంది. వారు నిశ్చలంగా వుంటారు. ఆ నిశ్చలత, వారి సన్నిధికి చేరిన వారికే కాదు, మొత్తం మానవాళిని అదే స్థితిలోకి చేరుస్తుంది. అది పరిమిత కాలానికి కావచ్చు, యింకా అధికంగా కూడా కావచ్చు.

**కలతలు లేకుంటే నిశ్చల స్థితి**

మనస్సు ఏ కలతలకూ లోను కాని కారణంగా ఆ నిశ్చలత ఏర్పడుతుంది. అయాచితంగా ఆ స్థితిలోకి చేరినప్పుడు, మనకే ఆశ్చర్యం కలుగుతుంది. అలాంటప్పుడు ఈ మొత్తం ప్రపంచం ఎంతో అందమైన ప్రదేశం అన్న భావన కలుగుతుంది. అందరూ మంచివాళ్ళేననిపిస్తుంది. మనం వాంఛించకుండా వచ్చిన ఆ అనుభవం, అప్పుడప్పుడూ మనకు తెలియకుండగానే ముగిసి పోతుంది. ఆ స్థితి ప్రసాదించే పరమానందం వర్ణింపలేనిది. దానిని రుచి చూచిన వ్యక్తి, తిరిగి పొందాలని వివిధ పద్ధతులను

ఉపయోగించి ప్రయత్నిస్తాడు. వాటివల్ల కొన్ని సమయాలలో విజయం లభించవచ్చు లేదా లభించకపోవచ్చు కూడా.

తగినంతగా అనుభవించేసరికి, అది నిజమే, భ్రమ కాదని, కల కాదని, తెలియవస్తుంది. ఆ ప్రశాంత స్థితిలో, అసాధారణమైన శక్తి లభిస్తుంది. సాధారణంగా లభించే శక్తి కాదది. శాంతిర్నితాంత మధికా పరమాస్య శక్తిః .... భగవాన్ యొక్క శక్తి వారి ప్రశాంతత ద్వారా లభించినది. శక్తి, శాంతి జంటగా వుంటాయి. ఆ శక్తిలో వ్యక్తిత్వం వుండదు. అది సాధారణ శక్తిని మించినది. మానసిక శాంతిని సాధించిన వారు, ఆ అసాధారణమైన శక్తిని, తమను తలచుకున్న వారికీ, తలచుకోని వారికీ కూడా ప్రసాదించగలరు. మనం కోరడం కాదు, మనమే దైవ కృప వల్ల ఎన్నుకొనబడతాం. అది మన ఎఱుకలో లేకుండా జరుగుతుంది.

భగవంతుడు కరుణా స్వరూపుడు గనుక, మన తప్పులను, అపరాధాలను, పాపాలను బేరీజు వేసి నిర్ణయం తీసుకునే ప్రసక్తి లేదు. అరుణాచలుని కరుణను మనం అవగాహన చేసుకోలేము. కరుణాపూర్ణ సుధాబ్ధే... అన్నట్లు అరుణగిరి కరుణా సముద్రం. అరుణాచలా! నీ కృపను నాపై వర్షించు అని భగవాన్ అరుణాచల స్తుతి పంచకంలో ప్రార్థిస్తారు. హృదయపూర్వకంగా చేసిన అలాంటి ప్రార్థన కూడా, కృప వల్లనే అనుగ్రహింప బడినదని మనం గమనించాలి.

******

# స్వామి రాజేశ్వరానంద

**శ్రీరమణాశ్రమ ప్రచురణ Fragrant Petalsలోని మొదటి వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: శ్రీ ఎమ్.వి.ఎస్. ప్రసాద్**

మోక్షానికి పర్యాయపదం భగవాన్ రమణులు. వారు మూర్తీభవించిన ముక్తి స్వరూపం. పరమోత్కృష్ట శాంతికి మూలస్థానం. ఈ భువిపై, యావత్ జీవకోటికి వారు ఒక నిగూఢ ప్రహేళిక. మనలను దేహభ్రాంతి నుండి, మనో వికారాల నుండి ఆత్మసాక్షాత్కారం వైపునకు కొనిపోయే పుణ్యమూర్తి భగవాన్. వారి సన్నిధిలో ఆత్మ సాక్షాత్కారమంటే, అది మన నర నరాన ప్రసరించి, అణువణువునా కలిగే అనిర్వచనీయ హృదయ స్పందన. భగవాన్ పలుకులు, శాశ్వతమైన ఆత్మజ్ఞానాన్ని మనకు విశదం చేస్తాయి. భగవాన్ మౌన సంభాషణలు, కరుణాపూరితములైన వారి దృక్కులు, మన ప్రవృత్తిలో భాగమైన ఆత్మ విచారాన్ని మనకు అందిస్తాయి. రమణుల సన్నిధిలో లభించే ఆధ్యాత్మిక శాంతి, పరిమళసంభరితమైన అద్భుతం. వారి జీవితం, చైతన్యపూరితమైన మౌనం నుండి ఆవిర్భవించిన దివ్య ప్రకాశం.

నిత్య జీవితంలోని చింతలు, బాధలు భగవాన్ సమక్షంలో మంచులా కరిగిపోయేవి. దివ్యమైన స్వస్వరూప జ్ఞానాన్ని పొందే అపూర్వ ప్రక్రియను మానవాళికి అందించిన మహాత్ములు రమణులు.

జీవితాన్ని అన్ని స్థాయిలలో స్పృశిస్తారు భగవాన్. వారి బోధలు,

ఏ వర్గీకరణకు లోబడేవి కావు. అందుచేతనే ఏ యోగము, ఏ సిద్ధాంతము, ఏ వ్యవస్థ వారు తమవాడని, వారిది తమ మార్గమని చెప్పలేకపోయాయి. జ్ఞాని, తత్త్వవేత్త, తపస్వి, అవతార పురుషుడు-యివేవీ, రమణులను వివరించడానికి సరిపోయే పదాలు కావు. ఈ నిర్వచనాలన్నింటికీ వారు అతీతులు. వారు, ఏ ప్రాచీన సంప్రదాయాల నుంచి అవతరించిన వారు కాదు. ఏ గురువు నుండి, ఏ శాస్త్రాలనుండి జ్ఞానభిక్ష పొందినవారు కాదు. శాస్త్రాలు, భాష్యాలలో చెప్పబడిన జ్ఞానమంతా, వారి ఆత్మసాక్షాత్కారం పిమ్మట వచ్చినదే. శోధన, ఆ శోధన ఫలితము-రెండూ రమణులే.

ఆత్మ జ్ఞానం పొందడమనే పరమోన్నతమైన లక్ష్యాన్ని మన ముందుంచారు భగవాన్. ఆత్మ అనేది సృష్టించేది, సాధించేది కాదు. అది ఆద్యంతరహితమైన నిత్య శుద్ధ చైతన్యం. "నేను ఉన్నాను" అనే ఎఱుకయే ఈ జ్ఞానమని భగవాన్ బోధించారు. ఈ జ్ఞానమే, దేశ కాలాలకు, కార్యకరణాలకు అతీతమైన, శాంతిపూర్వకమైన నిరహంకార స్థితి. ప్రతి ఒక్కరికీ సుసాధ్యమైన ఈ జ్ఞానానికి నిదర్శనంగా భాసించారు భగవాన్. వ్యష్టి చైతన్యమే విశ్వ చైతన్యమని, ఆ దివ్యానందాన్ని పొందే సరళ మార్గమేమిటో మనకు ఉపదేశించారు. మనుష్యులను, జాతులను, దేశాలను విభజించి సృష్టించే సకల అనర్థాలకు, రుగ్మతలకు చికిత్స - వారిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేయడమే. నైతికంగా, ఆధ్యాత్మికంగా సరైన పునాది, ఆధారం లేకుండా, సౌభ్రాతృత్వ భావన లేకుండా, ఏ సమాజం కాని, దేశం కాని మన జాలదు. ఇటువంటి పరమోన్నత

స్థితి మాత్రమే సకల సమస్యలను, సంఘర్షణలను, విభేదాలను, విద్వేషాలను రూపుమాపుతుంది.

మనలోని ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రజ్వలింపజేస్తారు భగవాన్. వారు ఉపదేశించిన ఆత్మబోధ అత్యంత సరళము, ఆచరణాత్మకము. అదేదో సందేహాస్పదము, అజ్ఞేయం, వస్తుగతం కాదు. భౌతిక వాదానికో, ప్రకృతి వాదానికో దారి తీసేది కాదు. అస్తిత్వ వాదమో, అస్తిత్వ నిరాకరణమో, విధి లిఖిత వాదమో, ఆదర్శ వాదమో, ఆశా వాదమో, నిరాశా వాదమో కానే కాదు.

భగవాన్ రమణులు అద్వైత భావనకు, సర్వమత సామరస్యానికి నిదర్శనంగా నిలిచారు. వారి ఉపదేశామృతం ఎంత సరళమో, అంత శక్తిమంతం కూడా. అది ఛాందసభావాలకు, అర్థం లేని ఆచారాలకు అతీతం. మనలో నిద్రాణమైన దివ్యత్వాన్ని జాగృతం చేస్తుంది.

భగవాన్ జీవితం, బ్రహ్మ సత్యం - జగన్మిథ్య అనే సత్యానికి ఉదాహరణగా భాసించింది. భగవాన్‌ను తెలుసుకోవడమంటే, 'భగవాన్' కావడమే. ఎందుచేతనంటే ఎఱుకయే ఉనికి, ఉనికియే ఎఱుక. భగవాన్ పలుకులకంటే వారి మౌన భాషణయే మహత్తరమైనది.

నాలుగు దశాబ్దాలకు పైగా రమణ భగవానులతో మెలిగిన భాగ్యం నాది. వారి పాదారవిందముల చెంత నెలల తరబడి సేవించుకొన్న అదృష్టశాలిని నేను. భగవాన్ పవిత్ర పాదరేణువునని చెప్పుకోవడమే నా సుకృతం, నా సౌభాగ్యం.

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# స్వామి దేశికానంద

**శ్రీమతి మల్లాది ఫణిమాల**

స్వామి దేశికానంద శ్రీ రామకృష్ణ మఠంలో సన్యాసి. వారు శ్రీరమణుల పట్ల అపారమైన భక్తి ప్రపత్తులు కలవారు. మైసూర్ వేదాంత కళాశాలకు వీరు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు.

శ్రీ రమణ అనుగ్రహం చేత, 1927వ సంవత్సరంలో, వీరు తొలిసారిగా శ్రీ రమణుల సన్నిధి చేరుకున్నారు. మహర్షి చుట్టూ ఎందరెందరో భక్తులు మౌనంగా ధ్యానమగ్నమై ఉండడాన్ని చూసి వీరు ముచ్చట పడ్డారు. శ్రీరమణులు సోఫాపై ఎంతో గంభీరంగా కూర్చుని ఉన్నారు. పూర్వోత్తరపు కాలంలో ఋషులు మరియు మునుల ఆశ్రమాలలో నెలకొన్న చక్కటి దృశ్యం, అక్కడ స్వామి దేశికానందులవారికి గోచరించింది. మహర్షి, స్వామి దేశికానంద గారి వైపు యథాలాపంగా తమ దృష్టిని సారించారు. పవిత్ర జలాలతో వారి శరీరము, మనసు క్షాళనం చేయబడుతున్నట్టు స్వామి దేశికానందకు అనిపించింది. శ్రీ రమణుల మౌన వీక్షణలో అనిర్వచనీయమైనటువంటి పవిత్రత నెలకొన్నది. సమ్మోహన పరిచే వారి చూపుతోనే, స్వామి దేశికానందుల వారిలోని ప్రతి అణువు నిర్మలం చేయబడుతున్నట్టుగా వారికి అనిపించింది. శ్రీరమణ సన్నిధానాన కూర్చున్న ప్రతి భక్తునికి, మహర్షి ఇటువంటి అనిర్వచనీయమైన ఆనందాన్ని ప్రసాదంగా అనుగ్రహించే వారు.

‘‘మీరు ఎక్కడి నుండి వచ్చారు? మీ బస ఎక్కడ ఏర్పాటు చేయబడింది?’’ అని దేశికానందులవారిని బహు ఆప్యాయంగా పలకరించారు శ్రీ రమణులు.

లోక మహాగురువులైనటువంటి శ్రీ రమణ మహర్షుల వారి అనుగ్రహ నీడలోకి, నిజానికి వారి అనుగ్రహం వల్లనే రాగలిగాను అనేటటువంటి నమ్మకం స్వామి దేశికానందుల వారికి కలిగింది. శ్రీ రమణులు స్థాపించిన ‘ఆత్మశాంతి సామ్రాజ్యం’ ప్రసరించే శాంతిని, ఆనందాన్ని అనుభవించగలిగే నేపథ్యం కూడా, వారే అనుగ్రహంగా స్వామి దేశికానందుల వంటి భక్తుల జీవితాలలో కలిగేలా చేస్తారు. భక్తుడి జీవితానికి ఆధారభూతము మరియు పట్టుగొమ్మ అయిన గురు రమణులకు నివాళులర్పిస్తూ స్వామి దేశికానందుల వారు రచించిన ఈ పంక్తులు తిలకిద్దాం.

దక్షిణామూర్తి ప్రభో! ఎంత దయామయుడవయ్యా! మానవ రూపాన్ని ధరించి మానవాళిని మీ బోధతో ఆశీర్వదించారు.

సత్యం, శివం, సుందరం వీటి స్వరూపమైన శ్రీ భగవానులకు నా ప్రణామములు. పునః ప్రణామములు.

ఇలా శ్రీ రమణులను తిలకిస్తూ, వారి వైభవాన్ని వర్ణిస్తూ ఎన్ని రోజులైనా గడిపేయవచ్చు. వారి సన్నిధానంలో ఉండటం వల్ల కలిగే పరివర్తనం, అద్వితీయం... అపూర్వం. ఆ విధంగా, శివ రమణుని సన్నిధి విశేషంలో తరిద్దామని అరుణాచలం చేరుకున్న శ్రీ దేశికానందుల వారు, మర్నాడు ఉదయం మళ్లీ శ్రీరమణా

శ్రమానికి వెళ్లి, మహర్షి సన్నిధిలో ధ్యానం చేసుకోవడానికి కూర్చున్నారు. మహర్షి సముఖంలో అడుగుపెట్టగానే, వారు ఏకాగ్రం కాగలగడమే కాకుండా, ఏ మాత్రం ఆటంకం లేకుండా కొన్ని గంటల సేపు అవిరామంగా ధ్యానం చేసుకోగలిగారు. తద్వారా కలిగిన ఆ ఆనంద స్థితిని గురించి శ్రీ రమణులకు వారు విన్నవించుకున్నారు. శ్రీ రమణులు, "దేశికానందా! ధ్యానం చేసు కుంటున్నప్పుడు నిద్ర వస్తే మీరు నిద్రపోతున్నారా?" అని అడిగారు. "లేదు భగవాన్! నేను నిద్రపోవటం లేదు" అని దేశికానందుల వారు చెప్పిన జవాబు విని భగవాన్ సున్నితంగా నవ్వారు. మీరు అనుసరించే ధ్యాన పద్ధతి ఏమిటని మహర్షి అడుగగా, "హృదయం లోని జ్యోతిపై మనసును కేంద్రీకరించి, ధ్యానంలో కించిత్ అంతరాయం కలిగినప్పుడల్లా నా ఇష్టదైవాన్ని తలుచుకుని, వారి పాదాల చెంత ఒక పుష్పాన్ని సమర్పిస్తాను!" అన్నారు స్వామి దేశికా నందులవారు. ఈ పద్ధతిని, శ్రీ రామకృష్ణ మఠానికి రెండవ అధ్యక్షులుగా వ్యవహరించిన శివానందజీ మహరాజ్ ఉపదేశం చేశారనీ, అప్పటినుంచి ఇదే పద్ధతిని అభ్యాసం చేస్తున్నాననీ శ్రీ రమణులతో విన్నవించుకొనగా, అదే పద్ధతిని కొనసాగించమని మహర్షి వారితో చెప్పారు.

భోజనాల వేళ వరకు శ్రీ రమణులు సోఫాపై మౌన ఋషిలా కూర్చుని ఉండి, భోజనం తర్వాత కాస్త విశ్రాంతి తీసుకుని, అటుపిమ్మట మళ్లీ కూర్చోవడం... ఇలా, మహర్షి దినచర్య

కొనసాగుతుంది. మధ్య మధ్యలో, భక్తులు రాసే ఉత్తరాలను కూడా వారు చదువుతుంటారు. మహర్షి, తాము అమనస్కులు కావటం చేత ఏ విషయాన్ని గురించి అయినా ఏ భావము, అభిప్రాయము తమకు ఉండవని దేశికానందుల వారితో ఒకసారి అన్నారు. ''అరుణాచలం శాంతితో, సంతోషంతో నిండిపోయిన ఒక దివ్య ప్రదేశం'' అని, అంతలోనే సరిదిద్దుకుని, ''అరుణాచలాన్ని ఒక ప్రదేశం అని అనలేం! అసలు రెండోది లేనే లేదు'' అన్నారు మహర్షి. ఈ విధంగా, శ్రీరమణులు పలికిన మృదువాక్కులను వింటూ, వారి బోధలను అర్థం చేసుకుంటూ, వారిని కనులారా వీక్షిస్తూ, శ్రీ దేశికానందుల వారు తొమ్మిది రోజులు శ్రీ రమణాశ్రమంలో గడిపారు. తొమ్మిదవ రోజున మహర్షిని సమీపించి, వారికి మోకరిల్లి, విపరీతంగా ఏడ్చారు దేశికానందులవారు. వారి బాధకు కారణమేమని రమణులు అడుగగా, వెళ్లాల్సిన ఘడియలు ఆసన్న మైనాయని ఏడుస్తూ మహర్షికి విన్నవించుకున్నారు. దేశికానందుల వారిని ఓదారుస్తూ, ''నువ్వు ఇక్కడే ఉండవచ్చు దేశికానందా! వెళ్ళమని ఎవరూ చెప్పలేదు కదా...'' అన్నారు శ్రీరమణులు. ఆ మర్నాడు శ్రీ రమణుల అనుమతిని పొందిన దేశికానందుల వారు ప్రయాణమయ్యారు.

******

# విశ్వనాథ స్వామి స్మృతులు

**భగవాన్ పాద పద్మముల చెంత**

**శ్రీరమణాశ్రమ ప్రచురణ Surpassing Love and Grace లోని మొదటి వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: శ్రీ బి. రవికృష్ణ శర్మ**

భగవాన్ ను నేను మొదటిసారి 1921వ సంవత్సరం జనవరిలో స్కందాశ్రమము నందు దర్శించితిని. ఇది అరుణాచలం కొండకు తూర్పు భాగాన వున్నది. స్కందాశ్రమము ఎలా వున్నదంటే, అరుణాచలం కొండకు ఇది హృదయమా అన్నట్లు నాకు అనిపించింది. ఆశ్రమ వాతావరణము చాలా అందంగా, ప్రశాంతంగా కొబ్బరి చెట్లతో మరియు యితర వృక్షాలతో కూడి వున్నది. నేను దర్శించిన కాలము హేమంత ఋతువు కావటం వలన ఆకాశం ప్రకాశవంతంగా, నిర్మలంగా చాలా స్వచ్ఛంగా వున్నది. భగవాన్ అక్కడ వసించడం వలన ప్రకృతి మరింత శోభాయమానంగా, మరింత అందాన్ని సంతరించుకున్నట్లుగా అనిపించింది.

నేను భగవాన్‌ను దర్శించినప్పుడు, వారిలో ఏదో తెలియని, ఇతర మహాత్ముల వద్ద అనుభూతి చెందని ఆకర్షణీయ శక్తి నన్ను కట్టి పడేస్తున్నట్లుగా నేను అనుభూతి చెందాను. వారికి, తమ శరీరంతోను మరియు ఈ దృశ్యమాన ప్రపంచంతోను యెటువంటి సంబంధం లేదా అన్నట్లు కనుపించారు. వారి కరుణావీక్షణ దృష్టి మరియు వారి యొక్క చిరునవ్వు లేదా చిరు మందహాసం ఒక గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని కలుగజేస్తోంది. వారు మాట్లాడే ప్రతీ

మాట, వారి హృదయాంతరాళాలను చీల్చుకుని వస్తున్నదా అన్నట్లు అనిపించింది. వారిని దర్శించిన వారికెవరికైనా వారి యందు కల శుద్ధ స్ఫటికం లాంటి స్వచ్ఛతతో వారికి మరియు వారి కదలికలకు యెటువంటి సంబంధం లేదా అన్నట్లు కనిపిస్తారు. ఆకాశం వలె స్వచ్ఛమైన, నిర్మలమైన, శుద్ధమైన, నిశ్చలమైన ఒక దివ్యత్వాన్ని వారియందు నేను గమనించాను.

వారి సన్నిధిలోని ఒక గొప్ప అద్భుతమైన శక్తి వలన నా చిత్త చాంచల్యం అణచివేయబడి, నాలో ఒక ప్రశాంతమైన, ఆనందకర మైన అనుభూతిని చవిచూచాను. దీనిని రమణ లహరి - రమణుల యొక్క ప్రశాంత గాంభీర్యం అంటాను. ఈ ఆనందకరమైన అనుగ్రహంలో, ఎందరో తమయొక్క వ్యక్తిత్వాన్ని కోల్పోయి, అన్నింటికీ ఆధారమైన, అంతటా పరివ్యాప్తమై వున్న ఒకే ఒక చైతన్యంలో నిలకడగా, స్థిరంగా వుంటారు. ఇదియే అరుణాచలేశ్వ రుని యొక్క మూలతత్వం. ఈ అరుణాచలేశ్వరుడు తన అనుగ్రహ కాంతిచేత ఈ దృశ్యమాన ప్రపంచమును మ్రింగివేస్తాడు.

ఆశ్రమంలో పదిమంది దాకా భగవాన్ భక్తులు నివసిస్తున్నారు. ఆ పదిమందిలో వారి తల్లిగారైన అళగమ్మగారు మరియు వారి తమ్ముడైన నాగ సుందరంగారు వున్నారు. వారిలో వల్లిమలై మురుగ అనే భక్తుడు ప్రతీ ఉదయం తమిళ భక్తి కావ్యమైన అరుప్పుగళ్ ను యెంతో భక్తి శ్రద్ధలతో పాడేవారు. అరుప్పుగళ్ అనే భక్తి కావ్యం, జన బాహుళ్యంలో బాగా ప్రచారంలో వున్న అరుణగిరినాథర్ అనే

ఒక మహా భక్తునిచే సుబ్రహ్మణ్య స్వామిని స్తుతిస్తూ పాడిన పాటలు. వల్లిమలై మురుగ పాడేటప్పుడు, భగవాన్ వారి పాటకు, అక్కడ వున్న ఇనుప కుంపటి యొక్క కొక్కెములను రెండు కఱ్ఱ ముక్కలతో తాళం వేస్తూ వుండటం వలన, అక్కడి వాతావరణం ఒక గొప్ప ఆధ్యాత్మిక, భక్తి పారవశ్యంతో ఆవరించి వున్నది. భగవాన్ చేతులు కఱ్ఱలతో కుంపటి మీద నాట్యం చేస్తుండగా, వారి అపారమైన అనుగ్రహ వీక్షణం అక్కడ వున్న ప్రతీ ఒక్కరినీ లోకాలకు అతీతమైన ఒక మనో ప్రశాంతతలోనికి తీసుకువెళ్ళింది అనటంలో ఎటువంటి సందేహం లేదు. ఇది నేనెప్పటికీ మరచిపోలేని ఒక గొప్ప మహత్తరమైన అనుభూతి.

వారిలో ఇంకొక భక్తుడు చిదంబర నివాసియైన సుబ్రహ్మణ్య అయ్యరు. వారు, భగవాన్ చే అరుణాచలేశ్వరుని స్తుతిస్తూ పాడిన తిరువాచకం అనే భక్తి కావ్యాన్ని సుందరంగాను మరియు అతి మనోహరంగా భక్తి పారవశ్యంతో పాడేవారు. వారు భగవాన్‌ను కూడా స్తుతిస్తూ పాడుతూ వుండేవారు. ఒకసారి వారు రమణ సద్గురు, రమణ సద్గురు, రమణ సద్గురు రాయనే అనే పాటను పాడుతూ వుండగా భగవాన్ కూడా వారితో కలిసి పాడటం ప్రారంభించారు. అప్పుడు అక్కడ వున్న భక్తులు, భగవాన్ తమ గురించి తామే పాడుకోవటం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ నవ్వారు. భగవాన్ అప్పుడు ‘‘దీనిలో ఆశ్చర్యమేమున్నది? రమణులంటే ఈ ఆరడుగులు కల శరీరమున్న ఒక రూపమా? ఎందుకు ఈ

ఆరడుగుల శరీరానికే పరిమితం చేస్తారు? (రమణుడు అంటే సర్వమును రమింపజేసేవాడు అని అర్థం). మీరు రమణ సద్గురు, రమణ సద్గురు అని పాడేటప్పుడు అంతటా పరివ్యాప్తమై వున్న ఆ పరబ్రహ్మమును ఆరాధించటం లేదా? నేనెందుకు మీతో కలసి ఆ విధంగా పాడకూడదు? అని భగవాన్ అనేటప్పటికి, మేమంతా భగవాన్ యొక్క తర్కానికి ఆనందించి, వారి అభిప్రాయంతో ఏకీభవించి, మేము కూడా ఒక ఉన్నతమైన స్థితికి కొనిపోబడ్డామని అనిపించింది.

ఆశ్రమంలో వసించేవారందరూ, ప్రతిదినము సూర్యోదయము నకు పూర్వమే లేచి, అరుణాచలేశ్వరుని మరియు భగవాన్ని స్తుతిస్తూ పాడిన తరువాతనే వారి వారి నిత్యకృత్యాలను ప్రారంభించే వారు. నిరంజనానంద స్వామి భగవాన్ తో, నేను సంస్కృతంలోని కొన్ని స్తోత్రాలను పాడగలను అని చెప్పి ఆ స్తోత్రాలను పాడిన తరువాత భగవాన్ నావంక ఏదో ఆశిస్తున్నట్లు చూడడం గ్రహించిన నేను, భగవాన్ నుండి తప్పించుకోవటం దుర్లభం అని తలచి, సంస్కృతంలోని మరి కొన్ని స్తోత్రాలను పాడాను. నేను పాడటం పూర్తి చేసిన పిమ్మట, భగవాన్ నన్ను అనుగ్రహ పూర్వకంగా చూస్తూ ఈ విధంగా పలికారు. ‘‘నీవు ఇవన్నీ నేర్చుకున్నావు. కానీ నా విషయం అలా కాదు. నేనిక్కడికి రాక పూర్వము నాకేమీ తెలియదు. ఏదో ఒక మహత్తరమైన శక్తి నన్ను ఆవహించి పరిపూర్ణంగా మార్చివేసినది. అప్పుడు ఎవరికి తెలుసు, నాకేం జరుగుచున్నదో?

నీ తండ్రి, తన చిన్నతనంలో ఎప్పుడూ హిమాలయాలకు వెళ్లి తపస్సు చేసుకోవాలని అనుకుంటూ ఉండేవాడు. కానీ ఏమైంది? తను ఒక పెద్ద కుటుంబానికి పెద్ద దిక్కయ్యాడు. మరి నేను, ఏమీ తెలియని వాడిని, ఏ ప్రణాళికలు వేసుకోని వాడిని. ఒక మహత్తరమైన శక్తి చేత ఇక్కడికి గుంజివేయ బడ్డాను. అంతా మన మంచికే. నేను ఇల్లు వదిలినప్పుడు (నా పదిహేడవ సంవత్సరంలో) నేను ఒక మహా ప్రవాహంలో కొట్టుకొని పోబడ్డ ధూళి కణాన్ని. నాకు అప్పుడు శరీరం గురించి కాని, ఈ ప్రపంచం గురించి కాని, అలాగే అది పగలో రాత్రో కూడా తెలిసేది కాదు. అప్పుడు కళ్ళు తెరవటం కూడా చాలా కష్టమనిపించేది. కనురెప్పలు కనులతో అతుక్కుని పోయినాయా అని అనిపించేది. నా శరీరం ఒక ఎముకల గూడులా తయారైంది. అరుణాచలేశ్వరుణ్ణి దర్శించటానికి వచ్చిన వారు మరియు యితరులు నన్ను దర్శించి, నా స్థితిని చూసి జాలి పడేవారు. వారికేం తెలుసు? నేను ఎంత ఉన్నతమైన సత్‌చిత్ ఆనంద స్థితిలో ఉన్నానో?

నాకు చాలా సంవత్సరాల తరువాత తెలిసినదేమిటంటే, నేను అనుభవిస్తున్న స్థితిని ''బ్రహ్మము'' అంటారని. అది కూడా నేను వేదాంతానికి సంబంధించిన పుస్తకములను ఎవరో ఒకరు తెచ్చి యిచ్చినప్పుడు వాటిని తిరగవేస్తున్నప్పుడు చూచాను. ఈ వేదాంత గ్రంథాలను చూసి, వాటిలో చెప్పిన దానిని గ్రహించి, నేను చాలా ఆశ్చర్యానికి గురి అయ్యాను. ఇదేమిటి? నేను అనుభవించిన స్థితిని

యెక్కడ  చెప్పారే! అని. దీనినే బ్రహ్మమంటారా? అని అనుకున్నాను.

భగవాన్ యొక్క ప్రథమ భక్తులలో ఒకరైన శివ ప్రకాశం పిళ్ళై గారు భగవాన్ యొక్క సంక్షిప్తమైన జీవిత చరిత్ర - రమణ చరిత అహవల్ అనే తమిళ పుస్తకంలో ఈ విధంగా వ్రాశారు. ''పరబ్రహ్మం అనే పదం కూడా తెలియని వాడు పరబ్రహ్మమైనాడు'' అని. శివ ప్రకాశం పిళ్ళై గారు భగవాన్ సన్నిధిలో చాలా అణకువతో మానవత్వం మూర్తీభవించిన వ్యక్తిలా ఒక మూలన కూర్చునేవారు.

నాకు కొంత సంస్కృతం అర్థమౌతుందని గ్రహించిన భగవాన్, నన్ను ''శ్రీ రమణ గీత'' అనే పుస్తకాన్ని నా తండ్రికి యివ్వవలసిన దని ఆదేశించారు. నేను ఆ పుస్తకాన్ని మా తండ్రిగారికి యివ్వటం వలన, అది చదివిన మా తండ్రి గారికి భగవాన్ గురించి ఒక అవగాహన వచ్చింది. కాని నేను దానిని ఇంకా చదువలేదు. దానిని నేను 1922వ సంవత్సరం చివరలో చదవటం ప్రారంభించాను. భగవాన్ గురించి స్తుతిస్తూ వ్రాసిన ఈ గ్రంథాన్ని చదువుతున్నంత సేపు, ఓ విధమైన గొప్ప ఆనందాన్ని, అనుభూతిని చవిచూశాను. భగవాన్ గురించి ఆ గ్రంథంలో చదివినప్పుడు, నేను చాలా చలించి పోయాను. అప్పుడు నేను నా మనస్సులో దృఢంగా ఈ విధంగా నిర్ణయించుకున్నాను. నా మంచి కోసం నేను తిరిగి భగవాన్ దగ్గరకు చేరుకోవాలని. నా జీవితాన్ని ఏ విధంగా మలచుకోవాలో అని ఆలోచించుకుంటున్న క్లిష్ట సమయంలో, శ్రీ రమణ గీత నా

జీవితానికి ఒక మార్గ నిర్దేశనం చేసి, నన్ను పూర్తిగా ఆధ్యాత్మిక జీవితానికి అంకితమయ్యే విధంగా చేసింది.

పై నిర్ణయాన్ని నా తండ్రిగారు ఎట్టి పరిస్థితులలో అంగీకరించరు కనుక, నేను ఎవరికీ చెప్పకుండా 1923వ సంవత్సరము జనవరి 3వ తేదీ సాయంత్రం తిరువణ్ణామలై చేరాను. భగవాన్ స్కందాశ్రమాన్ని వీడి, గిరికి దక్షిణ భాగాన తమ తల్లిగారి సమాధి వద్ద ఒక కుటీరములోనికి శాశ్వతంగా మారారని తెలుసుకుని, స్కందాశ్రమము వద్ద ఆ సాయంత్రం కాసేపు ధ్యానం చేసుకొని, గిరికి ప్రదక్షిణంగా బయలుదేరి, భగవాన్ దగ్గరకు చేరుకున్నాను. భగవాన్ వున్న కుటీరంలోకి తొంగి చూడగా, భగవాన్ ఒక ఎత్తైన బండ మీద జారగిలి ప్రశాంతంగా కూర్చుని వున్నారు. నేను వారికి సాష్టాంగ నమస్కారం చేసి నిలుచోగానే, వారు నన్నీ విధంగా ప్రశ్నించారు. ఇక్కడికి వచ్చే ముందు నీవు నీ తల్లితండ్రుల అనుమతి తీసుకొన్నావా? ఈ విధంగా అడిగేసరికి నేను భగవాన్‌కు దొరికి పోయాను అనుకుని, భగవాన్‌తో ''మీరు ఈ విధంగా అడగనవసరం లేదు. ఎందుకంటే, నన్ను ఆపలేనంత బలంగా మీరు తమ పాదాల వద్దకు చేర్చుకున్నారు కనుక'' అని అన్నాను.

భగవాన్ ఒక చిరునవ్వు నవ్వి, నాతో, నా యొక్క క్షేమ సమాచారాన్ని నా తల్లితండ్రులకు ఒక లేఖ ద్వారా తెలియజేయమని, దాని వల్ల వాళ్ళు ఎటువంటి ఆందోళనకు గురికారని చెప్పారు. నేను ఆ తరువాత రోజు నా తండ్రికి ఒక ఉత్తరం వ్రాశాను. రెండు

రోజుల తరువాత నా తండ్రి గారు నాయొక్క యోగక్షేమముల గురించి తెలుసుకొనుటకు ఆశ్రమమునకు ఒక ఉత్తరం వ్రాశారు.

నేను భగవాన్ దగ్గరకు వచ్చిన రోజున, భగవాన్ భక్తులు కొంతమంది గుమిగూడి భగవాన్ 43వ జయంతిని తరువాత రోజున ఏ విధంగా జరపాలని చర్చించుకుంటున్నారు. అప్పుడు నాకు తెలిసింది, నేను భగవాన్‌ను చేరుకున్న దినం మహోత్కృష్టమైన ఆర్ద్రా దర్శనం రోజని.

ఆ మరుసటి దినం ప్రాతః సమయాన, కొంత మంది భగవాన్ భక్తులు, భగవాన్ సమక్షంలో ఆసీనులై వున్నారు. నా దృష్టి వారిలోని ఒక ప్రస్ఫుటమైన, ప్రకాశవంతమైన వ్యక్తి మీద కేంద్రీకరించుట జరిగినది. నేను వారినుండి నా దృష్టిని మరల్చలేకపోయాను. తరువాత, వారే కావ్యకంఠ శ్రీ వాసిష్ఠ గణపతి గారు అని తెలిసినది. వారిని చూసిన సమయాన నాకు ఈ విధంగా అనిపించింది. వారు ఒక శాస్త్రులవారే కాక, ఒక గొప్ప శాస్త్ర జ్ఞానం కలిగిన వ్యక్తి అని, గొప్ప కవి అని, గొప్ప తపస్సు చేసే వ్యక్తి అని అనిపించింది. వారి యొక్క విశాల ఫాలభాగము, మెరిసే కన్నులు, కాంతివంతమైన ముఖము, గడ్డము మరియు వారియొక్క శ్రావ్యమైన కంఠము, వీటన్నింటివలన వారు శాస్త్రాలలో చెప్పిన విధంగా ఒక పేరెన్నిక గన్న ఋషితో పోల్చదగ్గ వ్యక్తిలా నాకు తోచారు. వారి మాటలలోని గొప్పదనము, మాట మీద పట్టు, మాటలోని మృదుత్వము, సరళత్వము మరియు వారు మాట్లాడుతున్నప్పుడు వారి కళ్ళలో

మెరుపు వారి స్వభావాన్ని తెలియజేస్తాయి. వారు భగవాన్‌ను స్తుతిస్తూ అలవోకగా సంస్కృతంలో ఒక శ్లోకాన్ని చెప్పి, దానిలోని భావాన్ని ఈ విధంగా వర్ణించారు.

“అమ్మ ఉమాదేవి మీ కరుణావీక్షణాల ద్వారా ప్రకాశిస్తూ, భక్తులలోని అజ్ఞానాన్ని తొలగింపజేస్తోంది.

పద్మముల వంటి కన్నులు కలిగిన తల్లి లక్ష్మీదేవి, విష్ణుదేవుని యొక్క పట్టమహిషి, పద్మములవంటి మీ ముఖమండలము నందు ద్యోతకమౌతున్నది.

పరావాక్కు అయిన సరస్వతీ దేవి, బ్రహ్మ యొక్క పట్ట మహిషియై, మీ వాక్కుల యందు నాట్యమాడుచున్నది”.

ఓ గొప్ప మహర్షి యైన రమణా! విశ్వాచార్యుడవైన నిన్ను అల్పుడనైన, అల్పాయుష్కుడనైన నేను ఏ విధంగా పరిపరి విధాలుగా నుతించగలను?

******

## పాఠకులకు గమనిక

స్థలాభావము వలన, ధారావాహికంగా వస్తున్న శ్రీ గ్రిద్దలూరి కృష్ణమూర్తి గారి వ్యాసమును ఈ నెల పత్రికలో ప్రచురించ లేకపోతున్నందులకు చింతిస్తున్నాము. వచ్చే నెలలో తిరిగి కొనసాగించగలము. - సంపాదకులు

# Knowledge and Wisdom

Dr K Subrahmanian

अविनयं अपनय विष्णो दमय मनः शमय मृगतृष्णाम्
भूतदयां विस्तारय तारय संसारसागरतः

*avinayam apanaya vishno damaya manah shamaya mrigatrishnaam*
*bhuta dayaam vistaaraya taraya samsara sagaratah*

This is the first of the six beautiful *slokas* in Adi Shankara's *Vishnu Shatpadi*. It tells us what we should all pray for. *Vinayam* is *namrata* or humility; *avinaya* is pride or the absence of humility. Shankara tells us that we should ask the Lord to remove our pride. This is the first requisite of any *sadhak*, for spirituality and pride don't go together. Even in our ordinary conversation, we must ration our words because nothing should be wasted, not even words. There should neither be exaggeration nor minimization, and this is possible only when we pay attention. Very often,we refer to ourselves as the devotee of Baba, the Maharshi, Sri Aurobindo,etc. We should not say that we are the followers of the Maharshi or the devotees of the Maharshi. The word *bhakta* or devotee is a very big word. A real *bhakta* will never refer to himself a *bhakta*; he will leave it to those around him to describe him so. We are all only trying to be devotees; for most of the time, we are only devotees of ourselves. Occasionally, we try to become devotees of someone other than ourselves. We wonder whether we should worship some *vigraha* or the other, and

whether we should go to the temple. We pay a lot of attention in keeping our body clean, and often we become very upset when we’re not able to have a bath at a particular time in the morning and evening. Great attention is paid to cleaning the body, but we do not give the same kind of attention when it comes to cleaning the mind. Those who pay attention to the cleanliness of the mind, or even the complete annihilation of the mind, don’t pay attention to the body. They are indifferent to it. If there is water, they will clean the body; if there is no water, they will choose to remain dirty!

We should realise that *avinaya* is the beginning of wisdom. We need to realise that our knowledge of the *Gita* and the *Mahabharata* is only at the intellectual level; it is not based on experience. Reading a recipe on how to make *ladoos* is not a substitute for making it. All that we have read about the *Vedanta* is like reading a recipe; we know a great deal about what goes into it. When it finally dawns on us that we cannot know with our limited mind, there is wisdom. If we say we know, it is not wisdom. *Vedanta* literally means the end of knowledge. Therefore, knowledge of anything in this world is possible through the application of knowledge. If you want to be a physicist, all you have to do is apply your mind to the practice of physics, and after sometime, you will emerge as an expert in the subject. Though you may know a great deal about a particular subject, you will not know everything about it – in fact, nobody does, and that is why these subjects keep on expanding.

